తేదీ 14-12-1987న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

# మానవుడు దైవముయొక్క అంశమే!

**చదువుల్ నేర్చితినంచు గర్వము వహించన్‌రాదు నీకున్న యా**
**చదువేపాటిది, విద్యకున్ వినయమే సద్రూపమౌ నేర్వద**
**గ్గది యెంతో కలదంచు గర్వదురహంకారంబులన్ బాయుడీ**
**హృది దానన్ తలపోయుచుండు సుగతీ ఓ యీ అవిద్యాపతీ**

విద్యార్థులారా!

'తల్లి, తండ్రి, గురువు, దైవము' అని ఈ వరుసక్రమంలో మనము అందరినోటినుండి వింటూనే వున్నాము. ఆ క్రమమునకు తగిన అర్థముయేమిటో గుర్తించటానికి ప్రయత్నించాలి. మనము పుట్టిన తక్షణమే మనకి కనుపించేది, తల్లి. ఆమె పాలిచ్చి లాలించి, పాలించి, పోషించేది. అట్టి స్థితియందు అజ్ఞానముతో కూడిన బాలునికి తండ్రిని చూపించి తన అభివృద్ధికి తగిన మార్గమును ఆదేశించేది తల్లి. ఎట్టి వారికైననూ తండ్రిని చూపునది తల్లియే కాని, అన్యులుకాదు. తండ్రి, తిండిబట్టలనిచ్చి అభివృద్ధిగావించి తనయొక్క వున్నతస్థాయిని కోరి గురువును చూపించేవాడు. గురువు ప్రజ్ఞానమునుపదేశించి, తనయొక్క జీవితమునకు ఆధారమైన తెలివితేటలను పెంపొందింపజేసి యేకత్వమైన జ్ఞానతత్త్వాన్ని ప్రబోధించి దేవుని చూపేవాడు. యీ వరుస క్రమమునననుసరించి తల్లి, తండ్రి, గురువు, దైవము అనునవి ఒకరినుండి మరొకరిస్థాయికి గొనిపోయే సోపానములని మనము గుర్తించాలి.

## భక్తి, జ్ఞాన, వైరాగ్యములు ముక్తికి మార్గములు

అటులనే భక్తి మొదటిది. భక్తి అనగా భగవంతుని ప్రేమ రసామృతమును చవి



srisathyasaivahanamrutam

చూపించేది. మధురానందమును ప్రబోధించేది. దివ్యత్వములోవుండిన పవిత్రమైన ఆనందాన్ని అందించేది. అనంతమైన, అమృతమైన, అమరత్వమైన ఆనందాన్ని అందించేది. ఈ భక్తి క్రమక్రమేణా పెరిగి జ్ఞానమునకు అవకాశమునందిస్తుంది. జ్ఞానమనగా కేవలము లౌకిక జ్ఞానమేకాక, ఆధ్యాత్మిక జ్ఞానమునుకూడను ప్రబోధించేది. ఇట్టి ప్రాకృతమైన విషయములను గుర్తింపజేసి యివన్నీకూడను అనిత్యము, అశాశ్వతము, అసత్యమనే సత్యమును నిరూపించి వైరాగ్యమునకు గొనిపోయేది. ఈ జ్ఞానము యెంత కలిగినా కూటికి, యెంతకాలముండినా కాటికే అనే సత్యాన్ని నిరూపింపచేసేది. ఈ విధమైన ప్రబోధలు సల్పి వైరాగ్యమునుండి తత్త్వస్థితికి గొనిపోతుంది. తత్త్వమనగా మహావాక్యములందున్న 'అహం బ్రహ్మాస్మి', 'తత్త్వమసి', 'ప్రజ్ఞానం బ్రహ్మ', 'అయమాత్మ బ్రహ్మ' అనే యేకత్వానికి తీసుకొనిపోతుంది. ఈ తత్త్వమే క్రమక్రమేణా మోక్షమునకు దారి చూపిస్తుంది. ఏతావాతా భక్తి, జ్ఞాన, వైరాగ్య తత్త్వములు ముక్తికి మార్గములు.

**భాగవతము అనగా భక్తి, జ్ఞాన, వైరాగ్య, తత్త్వ, ముక్తులు ప్రసాదించేది**

భాగవతము భగవంతునియొక్క దివ్య లీలాగుణగణ విశేషములను ప్రబోధించేది. భాగవత కథలను మనము పఠించటముచేత, శ్రవణం చేయటంచేత, అందలి భక్తి భావమును అనుభవించటముచేత, ఆనందించటంచేత మనము బాగవుతాం. కనుకనే, భాగవతమనగా బాగవుతామనేది దీని అర్థము. ఈ 'భాగవతము' అనే పదమునందు ఐదు అక్షరములుంటున్నవి. భా-గ-వ-త-ము. 'భ' మొదటి అక్షరము, భక్తికి సంకేతము. 'గ' రెండవ అక్షరము, జ్ఞానమునకు సంకేతము. 'వ' మూడవ అక్షరము, వైరాగ్యమునకు సంకేతమవుతుంది. 'త' నాల్గవ అక్షరము, తత్త్వాన్ని నిరూపిస్తుంది. ఈ నాల్గింటి మార్గముచేతనే ఐదవదైన ముముక్షత్వమనే మోక్షము దీనిని ప్రదర్శింపజేస్తుంది. భాగవతము అనగా భక్తి, జ్ఞాన, వైరాగ్య, తత్త్వ, ముక్తులు ప్రసాదించేది.

**ఎక్కడనుండి వచ్చామో అక్కడికిపోయే త్రోవను మనం మరచిపోయాము**

ఇట్టి భాగవతమునందు ప్రహ్లాదునియొక్క వాక్యములు ఆదర్శములు. ప్రహ్లాదుడు ఒక విద్యార్థి. ఈ విద్యార్థి అనేక విద్యలు అభ్యసిస్తూవచ్చాడు. ఈ విద్యలయందున్న

sri sathyasai vahini amrutam

మూలాధారతత్త్వమును గుర్తించాడు. తోటి విద్యార్థులతో చెపుతున్నాడు.

**దీనశుభములేదు దివ్యకీర్తియులేదు**
**జగతి పుట్టిపుట్టి చచ్చి చచ్చి**
**వరలనేల మనము పుట్టని చావని**
**త్రోవ వెదకుకొనుట దొడ్డబుద్ధి**

'త్రోవవెదుకుకొనుట దొడ్డబుద్ధి' అన్నాడు. ఇదే ద్వాదశాక్షరముల మంత్రము. త్రోవవెదుకుకొనుట దొడ్డబుద్ధి అనే మంత్రములో పన్నెండక్షరములు ఉన్నవి. ఇదే ద్వాదశాక్షరిమంత్రము. అయితే యే త్రోవను వెతుక్కోవటం? ఎచ్చటనుండి వస్తిమో అచ్చటకి పోయే త్రోవను మనం మర్చిపోయినాము. మరచిపోవటంచేత తిరిగి దానిని వెతుక్కోవటం అనేది సంభవిస్తున్నాది. మరుపేలేకుండిన వెతికే అవసరమే లేదు.

**దైవానుగ్రహము, దైవకటాక్షము లేకుండిన మానవుడు జీవించటము దుర్లభము**

భగవద్గీతయందు ప్రత్యక్షముగా ప్రబోధించిన ఉపదేశములలో 15వ అధ్యాయములో 7వ శ్లోకములో తాను యెట్టివాడు అనేది 'మమైవాంశో జీవలోకే, జీవభూతస్సనాతనః'. 'మానవుడా! నీవు కేవలము ప్రకృతి అంశముకాదు, తల్లితండ్రుల అంశముకాదు, పంచభూతముల అంశముకాదు, 'మమైవాంశో' 'నా అంశమే' అని చెప్పాడు, కృష్ణ పరమాత్మ. కనుక, అంశము అనేది ఆధారమును వదలి అరక్షణమైనను వుండుటకు వీలుకాదు. కొమ్మ వృక్షమునకు అంశము. కానీ వృక్షమును వదలి కొమ్మ విడిగా బ్రతుకలేదు. బిడ్డ తల్లిఅంశము. తల్లిని వదలి బిడ్డ బ్రతుకలేదు. అదే విధముగనే మానవుడు దైవముయొక్క అంశము. కనుక, దైవమును వదలి తాను వుండుటకు వీలుకాదు. నీవు అనుకోవచ్చు, 'నేను దైవాన్ని స్మరించకుండా వున్నాను కదా!' అని. కాని, అది పొరపాటు. దైవము నీలో యేదో ఒక అంతరాంతరాళములో సాక్షీభూతుడుగా వుంటున్నాడు. నీకు తెలియకపోవచ్చును. దైవానుగ్రహము, దైవకటాక్షము అనేదిలేకుండిన మానవుడు జీవించటము దుర్లభము. అయితే, యిట్టి కష్టములకు బాధలకు మానవుడు గురి కావటానికి కారణమేమిటి? తనకు ఆధారమైన దైవమును మరచటమే యీ దుఃఖమునకు, యీ

sri satyasai vachanamrutam

రోగములకు, యీ కష్టములకు కారణము. కావున, తాను మరచిన త్రోవను తిరిగి వెతుక్కోటానికి ప్రయత్నించాలి.

**మనవెంట వచ్చునది సంసారముకాదు, సంస్కారము**

మీకందరికి తెలుసు, బిడ్డ పుట్టిన తక్షణమే 'క్వాక్వా' అని అరుస్తుంది. 'క్వ' అనగా ఎక్కడ, నా జన్మస్థానమెక్కడ, నా స్వస్థానమెక్కడ?' అని అరచుకుంటున్నాడు. స్వస్థానము యెక్కడ అని అరచేది యెలాంటిస్థితిలో? అన్నీ మరచి నిర్మలంగా, నిస్స్వార్థమైన హృదయముతో ఆ పసిపాప హృదయమునుండి ఆ పవిత్రమైన స్వచ్ఛమైన, సత్యమైన పిలుపు వినిపిస్తుంది. కాని, పెరుగుతూ పెరుగుతూ విషయవాసనలు, జగత్ సంబంధమైన బంధములు పెంచుకోటంచేత తన స్వస్థానమును మరచిపోతున్నాడు. లోకవాంఛలను అభివృద్ధి గావించుకోటంచేత, తన స్వస్థానముయొక్క భావమును విస్మరిస్తున్నాడు. ఈ విధంగా మనం దైవమును మరచినప్పుడు దుఃఖములకు సమీపులవుతున్నాము. పురందరదాసు చెప్పాడు 'మరదు నిన్ను దయను నిన్ను' అనగా నిన్ను నేను మరచిపోటంచేతనే యీ మట్టిలో నేను వచ్చి పుట్టాను, అని. 'చిన్మయరూపుడవైన నిన్ను మరచటంచేత నేను మృణ్మయాకారుడనై జన్మించాను. భగవంతుడా! నిన్ను మరచటంచేతనే నేను యీ దుఃఖములకు గురైపోయాను. కనుక, నిన్ను మరువని తత్త్వాన్ని నాకు అనుగ్రహించమ'ని కోరాడు. కనుక, మానవజీవితము బయటనుండి వచ్చినదికాదు. భగవంతునినుండి వచ్చినది. మన వెంటవచ్చునది సంసారముకాదు, సంస్కారము. సంసారమును కోరవలసినదేకాని ప్రేమించవలసినదికాదు. కనుక, మనము మంచి మాటలను, మంచి విషయములను అతి శ్రద్ధతో హృదయమునందు పదిలపరచుకొని తద్వారా మన జీవితాన్ని దైవమువైపు మరల్చటము అత్యవసరము. భగవంతునికి ఒక పీఠముగా వుండవలసిన మానవుని పవిత్రమైన హృదయము యీనాడు దుర్భావములకు, దురభ్యాసములకు ఆలవాలమై వుంటుండాది. కనుక, యిట్టి హృదయమును పరిశుద్ధము చేసుకొని పవిత్రమైన పరమాత్మునకు పీఠముగా యేర్పరచుకోటం అత్యవసరము. అయితే, నేడు విద్యలు పెరుగుకొలది వికారములుకూడను అధికమవుతున్నాయి.

srisathyasaivachanamrutam

**చదువుకంటె సంస్కారము మిన్న**

ఈ విద్యలవల్ల మనకు లభించేది కేవలము అవిద్యయే! విద్యయొక్క సారమును మనము యేమాత్రము అనుభవించలేకపోతున్నాము. భౌతికమైన సుఖసంతోషములను ఆశించి, నిత్యసత్యమైన దైవత్వమును విస్మరించటము మానవునియొక్క కర్తవ్యము కాదు. చదువుకంటె సంస్కారము మిన్న. అధికారముకంటె నిత్యజీవితములో మనము అనుభవించే జ్ఞానము అత్యవసరము. కాని, యీనాడు మనము లోకజ్ఞానమును దూరముచేసుకొని, బ్రహ్మజ్ఞానమును విస్మరించి మరి యే జ్ఞానమునో అనుసరిస్తున్నాము. అది యేజ్ఞానమో మనకు అర్థము కావటంలేదు. కనుక general knowledge అనే దానిని మనం అభివృద్ధిగావించుకోవాలి. నిత్యజీవితములో మన వెంట జంట వుంటుండి, మనకు అన్ని విధములా తోడ్పడేది general knowledge.

**జగత్తులో జీవించాలంటే లోకజ్ఞానము చాలా అవసరం**

మనము జగత్తులో మెలగాలంటే లోకజ్ఞానమనేది చాలా అవసరం. ఈనాడు మనము కేవలము గ్రంథపరిచయము మాత్రమే తీసుకుంటున్నాముగాని, లోకసంబంధమైన వ్యవహారములందు యెప్పుడు, యెక్కడ, యే విధముగా నడచుకోవాలి అనే విషయమును మనము యే మాత్రముకూడను తెలుసుకోటానికి ప్రయత్నించటంలేదు. మనము చదువుకున్నామని చెప్పి యేవో కొన్ని డిగ్రీలు తీసుకుని యింటిదగ్గర సేవలుకూడను చేయలేకుండాపోతున్నాము. పదిమందికి సహాయము చేయలేకపోతున్నాము. దీనికి ఒక చిన్న ఉదాహరణ. విద్యయందు తనయొక్క సహజమైన గుణములనుకూడను కోల్పోయిన వ్యక్తి ఒకడున్నాడు. అతనే గార్గుడు. అతడు భారద్వాజమహర్షి వద్దకు వెళ్లి "స్వామీ! నేను చాలా బీదవాడిని, జ్ఞానార్జన నిమిత్తము నేను యెంతో ప్రయత్నము చేస్తున్నాను. నన్ను అనుగ్రహించి మీ శిష్యులలో ఒకరుగా తీసుకో"మని ప్రార్థించాడు. అతని శ్రద్ధాభక్తులు పురస్కరించుకొని మహర్షి అతనికి చక్కగా బోధిస్తూవచ్చాడు. రాత్రింబగలు శ్రమించి విద్యను అభ్యసించడంచేత అతడు గొప్ప విద్యావంతుడైపోయాడు. అన్ని శాస్త్రములు, వేదములు, తర్కములు, వ్యాకరణములు, సాహిత్యము యిత్యాది అంశములలో

sri sathyasai vahini amrutam

ప్రవీణుడయ్యాడు. అయితే విద్య పెరిగేకొలది అతని అహంకారముకూడను పెరుగుతూవచ్చింది. మీ పిల్లలందరికి తెలిసేవుంటుంది. సీ-సా అని వుంటుంటాది. ఒకటి క్రిందకు దిగుతే మరొకటి పైకి లేస్తుంది. ఒకటి పైకి లేస్తే మరొకవైపు క్రిందకి దిగుతుంది. ఈ విధముగా వుండినప్పుడే అది సరైన balance లో వుండి ఆటలాడుకోటానికి వీలవుతుంది. యీ గార్గ్యునియొక్క పరిస్థితి ఏమంటే విద్య పెరిగేకొలది వినయ, విధేయతలు తగ్గి దానికి విరుద్ధమైన అహంకారము పెరుగుతూ వచ్చింది. ఆశ్రమానికి వచ్చిన ప్రతి పండితునితోను వాదోపవాదములు చేయటము, వారిని ఓడించటము అదే తనయొక్క ఆనందముగా భావించుకోటం, ఇలా జరుగుతూ వచ్చింది. ఈ విధముగా పైశాచికానందమును అనుభవిస్తున్న గార్గ్యుని చూచాడు, భారద్వాజుడు. "నాయనా! యింక నీకు యీ ఆశ్రమములో వుండటానికి అర్హతలేదు. నేను పుత్రవాత్సల్యముతో నీకు అన్ని విధములైన శాస్త్రములను బోధించాను. నీవు నీ స్వస్థానమునకు వెళ్ళి నీ తల్లితండ్రులను సేవించి సరైన రీతిలో జీవితాన్ని గడప"మన్నాడు. గురువును ధిక్కరించలేక ఆశ్రమమును వదలలేక వదలలేక, తన యింటికి వచ్చాడు. అయితే, ఆశ్రమమునుండి వెళ్ళిపోయేటప్పుడు గురువు కొంతదూరము వచ్చి తన వీపుపైన తట్టి "కుమారా! నీవు చాలా గొప్ప విద్యావంతుడివి. వెళ్ళుతున్నావు. ఇతర విద్యావంతులతో నీవు యేమాత్రము కూడను తర్కవ్యాకరణములయందు వాదోపవాదములు పెట్టి వారి మనసును బాధించకు. ఇది విద్యకు తగిన గుణము కాదు. పెద్దలను చూచి వినయముతో, విధేయతతో వారిని ఆశ్రయించాలి. గౌరవించాలి. ఇకపైన నీవు యింటికి వెళ్ళిన తరువాత యే పండితుడు వచ్చినప్పటికి వారిని గౌరవించి వారిని సరైన వినయవిధేయతలతో నడచుకో! అలా చేస్తానని నాకు వాగ్దానమివ్వ"మని కోరాడు, భారద్వాజుడు. యీనాటి మన పిల్లలు యిచ్చినట్లుగా గార్గ్యుడు తన గురువుకు వాగ్దానమిచ్చాడు. "నా జీవితములో తమయొక్క ఆజ్ఞను శిరసావహించి జీవితము ధన్యము చేసుకుంటాన"న్నాడు. "అదే నాయనా! నీకు పుణ్యం. గురువునకు అందించవలసిన దక్షిణ యిదే" అన్నాడు, భరద్వాజుడు. ఇంటికి వెళ్ళాడు. రెండు మూడు దినములు యింటిలో వుండినాడు.

కాని, తన యింటి పరిస్థితులు చాలా భయంకరముగా వుంటున్నాయి. తినటానికి



sri sathyasai vahini.org

తిండిలేదు. వుండటానికి కొంపలేదు. అతని తల్లితండ్రులు బిక్షమునెత్తే పరిస్థితిలో వుంటున్నారు. తల్లి పిల్లవానికి పట్టెడన్నమైనా పెట్టలేకపోతున్నానని కంటిధారలు కార్చింది. "అమ్మా! నీవు బాధపడనక్కరలేదు. నేను యెక్కడైనా బయటకువెళ్లి ధనమును సంపాయించుకొని వచ్చి మిమ్ములను పోషిస్తాన"ని వాగ్దానము చేశాడు. అక్కడనుండి బయలుదేరాడు. ఉపమన్యుడు అనే గురువు దగ్గరకు చేరాడు. అతను మహాపండితుడు. నిగర్వి. ఇతరులకు ఆదర్శమునందించే మహానుభావుడు. గార్గుడు అక్కడకు వచ్చిన తక్షణమే "నాయనా లోపలకు వచ్చి ప్రవేశించమ"న్నాడు. అతనియొక్క విద్యాశక్తులకు చాలా ఆనందించాడు. ఇతను రావటానికి కారణమేమిటని ప్రశ్నించగా యితను ఆర్థిక బాధలతో వచ్చానన్నాడు. అప్పుడు "నాయనా! నా దగ్గర వున్నది విద్య. నీకు ఆర్థికముగా సహాయము చేసేవాడనుగాను. నా వెంటరా. కాశీరాజు దగ్గరకు వెడదాము. కాశీరాజు విద్యావంతులను పోషించి, వారి స్థితిగతులను తాను గౌరవించి, వారికి తగిన సహాయము చేస్తాడు. అతను చాలా త్యాగి. అలాంటి మహారాజు దగ్గరకు వెడదాము రమ్మ"న్నాడు. నీకు భూరివిరాళాన్ని అందిస్తాడని చెప్పాడు. సరే, పట్టలేని ఆనందముతో ఆ ఉపమన్యుని జతలో కాశీరాజు దగ్గరకుపోయాడు. కాశీరాజు ఉపమన్యుని, అతని వెంట వచ్చిన శిష్యులను గౌరవించి వున్నతాసనాన్ని చేకూర్చాడు. 'యీ విద్యావంతుడు యెవరు' అని ప్రశ్నించాడు, కాశీరాజు. ఇతడు ఒక పండితుడని గార్గుని గురించి చెప్పాడు. "మీరు వచ్చిన కారణమేమిటి?" అని ప్రశ్నించాడు, మహారాజు. యేమీ చెప్పలేకపోయాడు గార్గుడు. ఉపమన్యుడు కాశీరాజుకి అతని పరిస్థితి అంతా వివరంగా చెప్పాడు. "అతని పరిస్థితి చాల హీనస్థితిలోవుంది. గొప్ప పండితుడు, కానీ తల్లి తండ్రులను పోషించే శక్తిసామర్థ్యములు లేనివాడుగా వుండటంచేత అతనికి యేమైనా ఆర్థికముగా మీరు సహాయము చెయ్యాల"న్నాడు, మహారాజుతో. ఆర్థిక సహాయము అని ఉపమన్యుడు చెప్పగనే గార్గునికి యెక్కడలేని గర్వము వచ్చేసింది. "నేను ఆర్థికసహాయము ఆశించి ఇక్కడకు రాలేదు. మీతో వాదోపవాదము వేయటానికి వచ్చాన"న్నాడు. అహంకారము అనే సర్పము బుసలుకొడుతూ కోరలు విప్పుకుంటూవచ్చినట్టుగా యీ విధంగా అహంకారము అతనిలోనుంచి మరింత పొంగిపొరలుతూవచ్చింది. భారద్వాజ ఆశ్రమములో గురువుకి యిచ్చిన వాగ్దానము, తన

sri sathyasaivachanamrutam

తల్లి తండ్రులకు యిచ్చిన వాగ్దానము రెండు వాగ్దానములు వుల్లఘించి తాను అహంకారముతో ప్రవర్తించటానికి పూనుకున్నాడు. కాని, ప్రక్కనే వున్న ఉపమన్యుడు అతనిని శాంతింపచేస్తూ "నాయనా! యిది మంచిదికాదు. మహారాజు గొప్ప పండితుడు. ఆయనతో నీవు వాదోపవాదాలు వేయటానికి యేమాత్రం అర్హుడవు కావు" అని అతనికి యెంతో సమాధానము చేస్తూవచ్చాడు. గార్గునియందు వుండినది పవిత్రమైన విద్యకాదు. కేవలము ఆడంబరమైన విద్య. కృత్రిమమైన విద్యచేతనే యీ విధమైన గుణములంతా అతనిలో ఆవిర్భవిస్తూవచ్చాయి. 'విద్యాదదాతి వినయం' అన్నారు. విద్యకు వినయమే భూషణం. అప్పుడు కాశీరాజు చాలా వినయవిధేయతలతో "నాయనా! నీతో నేను వాదించటానికి సిద్ధముగా లేను. అయినప్పటికి, నీవు వాదించాలని అనుకొన్నప్పుడు నేను వెనుకంజ వేయటం నాకు న్యాయంకాదు. రేపు ఉదయం ఏడు గంటలకు వచ్చి నీవు వాదనలో పాల్గొనమ"న్నాడు. మరునాడు ఉదయం సభ ప్రారంభము కాగానే ఆత్మశాస్త్రమనే దానిని గురించి కాశీరాజు ఒక ప్రశ్న వేశాడు. దానికి జవాబు చెప్పలేకపోయాడు, గార్గుడు. దీనితో అతడు చాలా పరాభవము పొందాడు. "మానవత్వమనగా కేవలము శరీరము, మనసు, బుద్ధి, యింద్రియములు మాత్రమేకాదు. ఈ అన్నింటిని మించిన ఒక అధికమైన స్థానము ఉన్నది. దానివల్లనే యివన్నీకూడను జరుగుచున్నవి. ఆత్మయే దీనికి మూలాధారము. నాయనా! ప్రపంచమంతా ఒక అద్దమువంటిది. ఈ అద్దము నీ ముఖముముందు పెట్టుకున్నంతవరకును నీ ప్రతిబింబము అందులో కనుపిస్తుంది. కాని అద్దమును ప్రక్కకు పెట్టేస్తే నీ ప్రతిబింబము కనుపించదుగానీ బింబము మాత్రము పోదు. అదేరీతిగా నీ దేహముకూడను ఒక అద్దమువంటిది. ఈ దేహములో కనుపించే జీవతత్త్వము ఆత్మయొక్క ప్రతిబింబమే! దేహముపోయినప్పుడు ప్రతిబింబము పోతుందిగాని, బింబము మిగిలి వుంటుండాది. అదే నిత్యసత్యమైన ఆత్మతత్త్వము, అట్టి ఆత్మతత్త్వమును గుర్తించుకోకుండా అవిద్యారూపమైన ప్రకృతి భావాన్ని నీవు భావించుకోటం పెద్దపొరపాటు", అని మహారాజు అతనికి చక్కగా బోధించి అతనికి కావలిసిన ధనము మూటకట్టి తల్లితండ్రులను పోషించేకోసం పంపించాడు. అతనిని ఆశీర్వదించి "నాయనా! నీ అహంకారము నిన్ను అథఃపతనము చేస్తుంది. ఈ అహంకారమునకు యేమాత్రము

srisathyasaivachanamrutam

అవకాశము అందించవద్దు. ప్రవృత్తిని ఆధారము చేసుకొని నివృత్తిలో ప్రవేశించ"మన్నాడు.

**పెద్దలు చెప్పిన మంచిమాటలు శిరసావహించాలి**

కనుక, యీనాడు మనకు ఆత్మ లక్ష్యం, ప్రకృతి నడకగా వుంటుండాలి. అయితే, నేటి విద్యార్థులలో ప్రకృతి దృష్టి, ఆత్మనడక. ఇది ఎట్లా జరుగుతుంది? జరగటానికి వీలుకాదు. యెవరైనా సరే పెద్దలు చెప్పిన మంచి మాటలు మనము శిరసావహించాలి. ఈ విధముగా తల్లి, తండ్రి, గురువు, దైవముయొక్క ఆజ్ఞలను శిరసావహించిన మానవునికి యేనాటికిని యే విధమైన లోటు జరుగదు. తాత్కాలిక ఆవేశములచేతను, తాత్కాలిక బాధలచేతను అనేక రకములైన మాటలు మనము చెప్పవచ్చును. మన సుందరయ్యకూడను కొన్ని నిమిషములకు ముందు చెప్పాడు, "ఏదో కొద్ది ఆవేశముచేత, స్వామివారిని చాలా కాలమునుంచి పలకరించలేదని". ఆ విధముగా చెప్పి ఇకపై జాగ్రత్తగా ఉంటామని ప్రోమిస్‌లు యిచ్చిన వారు ఒకరుకాదు, యిద్దరుకాదు, అనేకమంది. నాకు ప్రోమిస్‌లు యివ్వనక్కరలేదు. నేను ప్రోమిస్‌లు కోరటంలేదు. మీరు వచ్చిన పని పూర్తి చేసుకొని తిరిగి యిక్కడనుండి వెళ్లిన తరువాత గౌరవమర్యాదలతో తల్లితండ్రులను ఆనందపెట్టి వారికి తగిన సేవలు అందించటానికి కంకణము కట్టుకోటమే నాకు ఆనందము.

**ఏది మంచి, ఏది చెడు అనే వివేచనాశక్తిని పెంపొందించుకోండి!**

జీవితముయొక్క రహస్యాన్ని గుర్తించండి మొదలు. ఈ మంచిమాటలనేది discrimination అనగా యేది మంచి, యేది చెడ్డ అనేదానిని చక్కగా విచారించండి. అయితే, యీనాడు మానవుడు యేవిధమైన విచారణశక్తికి యేమాత్రము ప్రయత్నించటంలేదు. బయటి మనుష్యులు నీకు శ్రేయస్కరము కానివి చెప్పినప్పటికి వాటిపైన యెక్కువ అభిలాషను, అభిరుచిని అభివృద్ధిపరచుకొంటారు. ప్రేమతో మీ శ్రేయస్సునుగోరి చెప్పేటి వాక్యములు మీకు కష్టముగా అనిపిస్తూవుంటాయి. అక్కడే నీవు విచారించవలసినది. "ఎవరు చెప్పినది నాకు శ్రేయస్సు కలిగించేది, ఎవరు చెప్పినది నాకు ప్రేయస్సు. ఎవరు చెప్పినది నాయొక్క అభివృద్ధికి మూలాధారము, ఎవరి మాటలను మనము హతము చేస్తున్నాము" అనే విచారణ చెయ్యాలి. డాక్టరు పేషెంటు దగ్గరకు వచ్చి "నాయనా! నీ రోగము నివారణ కావాలంటే యీ

sri sathyasai vachanamrutam

పథ్యము నీవు పాటించాలి. అవి తినకూడదు, యివి తినకూడదు అని చెప్పినప్పుడు డాక్టరుపైన పేషెంటుకు కొంతవరకు కష్టము కలుగుతుంది. అదే ఒక మిత్రుడు వచ్చి "ఆ డాక్టరు మాటలు పట్టించుకోకు. నేను నీకు అన్నీ తెచ్చి పెడతాను. అన్నీ భుజించు, నీ ఆరోగ్యము బాగైపోతుంది" అని బోధ చేసేటప్పటికి అన్నీ మరచిపోయి ఆరోగ్యానికి భిన్నమైన పదార్థములు, ఆరోగ్యమును మరింత పాడుచేసే పదార్థములు భుజిస్తారు. ఆ మిత్రుని మాటలే తియ్యగా వుంటాయి. చెడుపు చేసేవారియొక్క మాటలు ఎప్పుడూ తియ్యగా వుంటాయి. మంచి కోరేవారి మాటలు కొంచెం కఠినముగా వుంటాయి. కాని అవి తాత్కాలికముగా కఠినముగా వుండినప్పటికి, అవి ఎంతో మనకు మేలు చేస్తాయి. ఒకే జలములో కమలము పుట్టింది, జలగ పుట్టింది. జలగ మనిషిని కఱచుకొని రక్తాన్ని పీల్చివేస్తుంది. కమలము హృదయానందమును అనుభవింపజేస్తుంది. ఉత్పత్తిస్థానము ఒక్కటే అయినప్పటికి వాటియొక్క స్థితిగతులు వేరే వేరే వుంటున్నాయి. ఒకటి ఉపకారి. వేరొకటి అపకారి. ఈ రెండింటియొక్క విచారణ మీలో కొంతవరకు అభివృద్ధికావాలి.

**స్వామికి ఏనాడు, ఎక్కడకూడను స్వార్థము లేదు**

కానీ, యీనాడు యీ విచారణశక్తి స్తంభించిపోయింది. కేవలము యింద్రియాలకు మాత్రమే అవకాశమునందిస్తున్నారుగాని, బుద్ధిని ఉపయోగించే విచక్షణవరకు పోనివ్వటంలేదు. స్వామి ఏదికోరినా, యేది చెప్పినా, యేది చేసినా మీ మంచికోసమేగానీ స్వామికి యేనాడు, యెక్కడకూడను స్వార్థమనేదిలేదు. కాని, యిట్టి సత్యాన్ని మీరు అర్థంచేసుకోటంలేదు. అర్థము చేసుకోలేకపోవటంచేతనే అనర్థములచేత పెడర్థములుతీసి దురవస్థలపాలౌతున్నారు. ఇలాంటి మాటలు నేను యెవరి నిమిత్తమై చెబుతున్నాను? చెప్పినది వినకపోటముచేతనే మీరు అనేక కష్టాలకు గురౌతున్నారు. మన Institute, ధనము లేదా ఏ ఫలితమును ఆశించి మేము స్థాపించలేదు. విద్యార్థులు యే పదిమందైనా మంచివారు చిక్కుతే జగత్తునకు ఆదర్శముగా నిరూపించవచ్చు అనే వుద్దేశ్యముతో విద్యలనే పేరుతో మిమ్మల్ని యిక్కడకు రప్పించుకొని వినయవిధేయతలనేవి నేర్పి తద్వారా జగత్తుకు ఆదర్శవంతముగా నిరూపించాలని నాయొక్క సంకల్పము.

srisathyasaivachanamrutam

## స్వామిది వెయ్యి తల్లుల ప్రేమ

ఏ తల్లికిని మీపై యింత ప్రేమవుండదు. వెయ్యితల్లుల ప్రేమ స్వామిది. ఒక చిన్న ఉదాహరణము. నిన్ననే జరిగింది. మీరు యోచించుకోవచ్చు. సాయంకాలము నేను భజనకు వచ్చేముందుగానే డా. చారి కాచుకున్నాడు, వరండాలో. వచ్చేసి, 'స్వామీ! చాలా డేంజర్ కేసు ఒకటుంది', అన్నాడు. 'ఏమిటాకేసు?' అన్నాను నేను. Severe heart attack అన్నాడు. 'ఇంక 10 నిముషాలో లేక అరగంటనో టైము. అంతతప్ప యిక బ్రతకటానికి వీలులేదు', అని చెప్పాడు. నీవు సరిగా టెస్టు చేశావా?' అన్నాను. ECG తీసుకొని వచ్చి, ఆయన Dr. Alreja అందరూ చూశారు. పల్సు పడిపోయింది. 50/60 వచ్చింది. blood pressure 120/80 వుండ వలసింది 50/60 కి దిగిపోయింది. 'డాక్టర్! నువ్వేమీ కంగారు పడవద్దు. పేషెంటుకు యిట్లాంటివంతా చెప్పకూడదు. నువ్వు వూరకే వుండ'ని నేను మెత్తగా అట్లా నడచుకొని పేషెంటురూమ్‌కి వెళ్లి పోయినాను. ఆ తల్లిని నేను చూస్తున్నప్పుడు చాలా వీక్‌గా వుంది. ఎవరైనా జనాలు వస్తారని నేను ప్రభాకర్‌ని వెంటతీసుకుపోయాను. కన్నులు మూసుకుంది యే చలనములేదు. ఆమె తలపట్టుకుని చూస్తున్న సమయములోపల ఆమె కుమారుడు కుమార్ భజనలో 'మాతపితా' అని ఒక పాట పాడుతున్నాడు. అది నాకు అక్కడ చెవిలోకి వినిపించింది. యీ తల్లిని, సాయితల్లిని తలచుకుంటున్నాడని నాలో తక్షణమే మనసు మారింది. కొంచెం నీరు తీసి ఒక టంబ్లరులో పోసి దానిని ఆమె నోట్లో పోశాను. ఎలాంటప్పుడు పోస్తారు నీళ్లు? మీరు బాగా అర్థము చేసుకోవచ్చు. అంత్యస్థితిలో పోస్తారు. నేను నీళ్లు పోయటం చూసి ఆమె భర్త కంగారుపడిపోతున్నాడు, యీమె వెళ్లిపోతుందేమోనని. ఆయనకు ధైర్యం చెప్పాను, 'నువ్వేమీ యోచన పెట్టుకోకు. చక్కగా వుంటుంది. నువ్వు బాధపడకు,' అని చెప్పాను. ఆమెకు ఎంతమంది బంధువులో ఉన్నారు. కాని యేవిధముగాను ఆమెను ఆదుకునేవారులేరు. ఒక్క సాయిమాత మాత్రమే పోయి ఆమెను ఆదుకుంది. రెండవసారి రాత్రి నేను వెళ్లాను, చూచాను. తెల్లవారి మళ్ళీపోయాను. ECG తీసారు. నిన్న కనుపించిన దోషము ECGలో యీరోజులేదు. Normalలో వుంటున్నది. 130/80 blood pressure. 80 పల్సు. అన్నీ perfect normal గా వుంటున్నాయి. Dr. Alreja, Dr. Chari వచ్చేసి 'యేమిటది? మాకు చాలా ఆశ్చర్యముగా



srisathyasaivachanamrutam

వుంటుండాది', అన్నారు. 'ఇంకా నువ్వు ఆశ్చర్యములోనే వుంటున్నావా? యిది నాకు సహజము, నీకు ఆశ్చర్యము' అన్నాను.

**ఎవరు చెప్పినప్పటికి మంచి మాటలు వినాలి**

ఆ విధముగా రక్షించటముగాని, శిక్షించటముగాని యెంతదయతోనో, యెన్ని విధములైన ప్రేమతోనో వుండే సాయితత్వాన్ని మీరు చక్కగా గుర్తించటం లేదు. చెప్పినట్లు వినినప్పుడు యెంతైనా బాగుపడతారు. ఈమెకే నేను మూడు సంవత్సరములముందు చెప్పాను, 'నీకు heart కొంచెం యిదిగా వస్తుండాది. ఏ విధముగాను నువ్వు శ్రమపడకూడదు. వంటలు చేయకూడదు', అని. స్వామి యేదో చెబుతున్నాడని ఆమె వంటలు చేయటం, తిరగటం యీ విధముగా జరుగుతుతున్నది. నేను చెప్పిన మాట వినలేదు. అదే విధముగనే నేను యెంతమందికో 'యిది చేయరాదు' అని చెబుతుంటాను. కాని ఎవరూ చెప్పినట్లు నడచుకోటంలేదు. తర్వాత దాని బాధలు వారు అనుభవిస్తూవుంటారు. అప్పుడు నాలో నేను 'యేమిటిరా, యెంత చెప్పినప్పటికి వారి క్షేమాన్ని వారి అభివృద్ధిని, వారియొక్క ఆనందాన్ని అనుసరించి నేను యెంత బోధించినా, వారు అర్థము చేసుకోటంలేదే', అని నాకు బాధ. పోనీ నాకోసం నేనేదైనా చెబుతే మీరు అనుసరించనక్కరలేదు. మీది narrow mind. సంకుచితమైన భావాన్ని మీరు అనుసరిస్తూపోతుంటారుగాని విశాలమైన భావాన్ని మీరు యేమాత్రంకూడను అభివృద్ధి చేసుకోవటంలేదు. మంచిమాటలు వినటమనేది మానవునియొక్క కర్తవ్యము. అదే ప్రాణము. ఎవరు చెప్పినప్పటికిని మంచిమాటలు మనము వినాలి. విని ఆచరించటానికి ప్రయత్నించాలి.

జీవితము నీటిబుడగవంటిది. మనము తలచుకుంటూవుంటే వుండినట్టే వుండి యెప్పుడు పోతుందో యేమో! అలాంటి అనిత్యమైన జీవితంకోసమని నిత్యసత్యమైన దైవత్వమును మనము యెందుకు త్యాగము చెయ్యాలి? మంచి మాటలు యెవరు చెప్పినా, గురువులు చెప్పినా లేక యింకెవరైనా పెద్దలు చెప్పినా, స్వామి చెప్పినా, మీరు చక్కగా అనుసరించి ఆచరణలో పెట్టటానికి ప్రయత్నంచేయండి!

sri sathyasai vachanamrutam

### ఎట్టి పరిస్థితులలోను మన మనస్సు ఒకే రీతిలో ఉండాలి

భజనలు చేస్తున్నారు. మీకందరికి స్వామిపైన ప్రేమ వుంది. భక్తివుంది. కాని యీ ప్రేమ, యీ భక్తి యెట్లావుండాలి అనేది మీకు తెలియటంలేదు. ఈ ప్రేమ అనేది స్వార్థమైనదిగా వుండకూడదు. ఏమైనా జరగనీ యీ ప్రేమను ప్రేమగానే పెట్టుకోవాలి.

**కూటికిలేక కష్టముల్ కోటి వచ్చినన్**
**ఆలుబిడ్డలు కాటికి నేగినన్, సంపదలుకూలినన్**
**తీరనిరోగములు ప్రాప్తియైనను**

ఎలాంటి పరిస్థితియందైనప్పటికి మన మనస్సు ఒకే రీతిగా వుంటుండాలి. యీనాటి పరిస్థితి యెలావుందంటే కష్టములు, నష్టములు, దుఃఖములు వచ్చేస్తే వేరుగా మారిపోతుంది. సుఖములు, ఆనందములు, సంతోషములు లభిస్తే మరొకరీతిగా మారిపోతుంది. ఈ విధముగా చలించేది భక్తి అనిపించుకోదు. ఇవన్నీ ప్రాకృతమైన మార్పులు. యేనాటికైనా కదలిపోయేవే! 'కదిలే వాటి నిమిత్తమై నేను పరమాత్మను ప్రార్థించటములేదు. నా ఆత్మానంద నిమిత్తమై నేను ప్రార్థిస్తున్నాను', అనే విశ్వాసమును మనము దృఢముగా తీసుకోవాలి.

### తల్లితండ్రుల ఆజ్ఞను శిరసావహించాలి, ఎక్కడున్నా సరే సత్ప్రవర్తనతో జీవించండి

మీరు పాసైన తరువాత పెండ్లిండ్లు చేసుకోకూడదనిగాని, తల్లితండ్రుల దగ్గరకు పోకూడదనిగాని, ఉద్యోగాలు చేయకూడదనిగాని, నేను యేనాడు యెవరికి చెప్పలేదు. కాని యీ పిల్లలలోపల కొన్ని విధములైన అభిప్రాయములు స్థిరపడుతూంటాయి. వారిలో కొంతమంది 'స్వామీ! మేము ప్యాస్ అయినప్పటికి బయటకు పోనే పోము; యిక్కడే వుంటుండి స్వామి సేవ చేసుకుంటాము', అని యిప్పుడు సుందరయ్యరు చెప్పినట్లుగా చెబుతారు. తదుపరి యేమి చేస్తారు? విద్యాభ్యాసము పూర్తయి ఇక పైచదువులకు ఇక్కడ అవకాశము లేకుండా వుండినప్పుడు స్వామి దగ్గర వున్నట్లుగా నటిస్తారు. కాని, 'ఎంతకాలమైనా యిక్కడ వుండటానికి వీలుకాదుకదా', అని తల్లితండ్రులకు ఉత్తరం రాస్తారు. ఏమని? 'నాన్నా నాకు వళ్లు సరిలేద'ని. యీ విధముగా జాబు రాసి తల్లితండ్రుల దగ్గరనుంచి జాబులు తెప్పిస్తారు, వెంటనే వచ్చేయమని. ఇది చాలా తప్పుపని. ఇది

sri sathyasai vachanamrutam

దైవద్రోహము. అంతకంటె నన్నడిగి ఆనందముగా బయటకు వెళ్లవచ్చు కదా! ఈ మాత్రం దానికి మీరు పెడమార్గం పట్టనక్కరలేదు. మీరు వెళ్ళి పోవాలంటే, నేను యేనాడు ఆటంకపరచను. లక్షణముగా మీరు బయటకు పోయి, అక్కడకూడను యీ విధమైన వాతావరణము అభివృద్ధి గావించాలి. కాని, మీలో చాలామంది మాటలు మాత్రము ఎక్కువగా చెప్తుతారు. అన్నింటికిని 'ప్రోమిస్, ప్రోమిస్'. దీనిలో విలువ యేమిటని మీరు గుర్తించటంలేదు. నాకు ఎవ్వరూ ప్రోమిస్‌లు చేయనక్కరలేదు. మీరు వచ్చినది విద్యకోసం, చక్కగా చదవండి. చక్కని మార్కులు తెచ్చుకోండి. మన Institute లోపల 'O' grade తెచ్చుకొని చక్కనిపేరుతో హాస్టలులో వున్నంతవరకు మంచి నడతతో జీవించండి. తరువాత మీరు యెక్కడికి పోవాలన్నా, యేమి చేసుకోవాలన్నా తల్లితండ్రుల ఆజ్ఞను శిరసావహించి మీ నిండు జీవితాన్ని సాగించుకోండి. అంతేగానీ వికారములు మీలో బయలుదేరి వికృతమైన మార్గాన్ని అనుసరించకండి. మీరు మంచిగా చదివి, యిక్కడవుండినా యెక్కడవుండినా disciplinedగా పెట్టుకోండి.

మొన్న ఆరునెలలకు పూర్వము holidays వచ్చాయి, ఒకనెల. ఇక్కడ వుండినప్పుడు మీరు యెట్లా వుండినారు? ఇక్కడనుండి వెళ్లేటప్పుడు మీరు స్వామికి యెటువంటి మాట యిచ్చారు? కానీ, అక్కడకు పోయిన తరువాత యే రీతిగా ప్రవర్తించారు? ఎవరి మనసుకు వారే సాక్షి. అన్నీ విరుద్ధమైన మార్గములే అనుసరించారు. ఇలాంటి సమయములోపల నేను మాటాడి ప్రయోజనమేమి? నేను మాటాడితే మీరు తిరిగి ప్రోమిస్‌లు యిస్తారు. ఆ ప్రోమిస్‌లు తిరిగి మిస్ అవుతాయి. ఈ విధముగా రావటం పోవటం, యీ విధమైన దాంట్లో మాటలతో ప్రయోజనము వుండదు. కనుకనే మీరు మంచిగా వుంటుండి, యిక్కడనుండి వెళ్లిన తరువాత మనయొక్క Institute disciplineను మీరు అనుసరిస్తుంటే అదే నాకు సంతోషము. నాకు మీరు వేరే ప్రత్యేకముగా సంతోషాన్ని అందించటానికి ప్రయత్నించనక్కరలేదు.

**క్రమశిక్షణ అనేది జీవితమంతా నీడవలె మిమ్మల్ని వెన్నంటి ఉండేటట్లు చూచుకోవాలి**

అయతే మీ పాత మిత్రులంతా వుంటారు. తల్లితండ్రులు వుంటారు. ఒరే

srisathyasaivachanamrutam

యింతకాలము స్వామియొక్క Instituteలో చదివి వచ్చిన పిల్లవాడు యితనిలో యీ మార్పు యేమిటని సహస్రనేత్రాలతో చూస్తూవుంటారు. అలాంటి సమయములోపల 'యేదో అక్కడవున్నంతసేపు నాటకం ఆడాడు. ఇక్కడికి వచ్చేసరికి పాత ఆటగానే వుంటున్నాది', అనే భావము వారిలో రాకూడదు. ఎంతోమంది తల్లితండ్రులు వచ్చి నా దగ్గర చెబుతూవుంటారు, 'స్వామిదగ్గర వుండినంతసేపు బాగుండినారు. కానీ అక్కడకు వచ్చిన తరువాత యింటికికూడా సరిగా రావటంలేదు. స్నేహితులతో తిరిగి చాలా పాడైపోతున్నాడు', అని తల్లితండ్రులుకూడా బాధపడుతుంటారు. అలాంటి బాధ స్వామికి ఆనందమవుతుందా, చెప్పండి! మీకు యింతకాలము ఒక్క నయాపైసా తీసుకోకుండా తగిన సదుపాయములను యొనర్చి అన్ని విధాలా ప్రేమించి మిమ్మల్ని అభివృద్ధిగావించినప్పుడు, మీరు కాలాన్ని, ధనమును, మీ పవిత్రతను అంతా పాడుచేసుకుంటున్నారే అనేదే స్వామికి బాధ. మీ విషయములో చిన్న చిన్న విషయములుకూడను నేను జాగ్రత్తగా చూసుకున్నాను. పాలు కొంచెం తక్కువైనా, పెరుగు నీళ్లయినాకూడను తక్షణమే విచారించి అదికూడను సరి చేయండి, పిల్లలు పెరిగే పిల్లలు. ప్రోటీన్సు కావాలి అని అనేకరకాలుగా నేనే విటమిన్ బి కాంప్లెక్సు పిల్సు అవీ నేనే యిక్కడనుంచి పంపిస్తున్నాను. ఏ తల్లి ఈ విధంగా చూచుకుంటుంది, చెప్పండి? హాస్టలులో యెలాంటి పదార్థములు వండాలి, యే విధముగా వండారు అని విచారిస్తూ ప్రతి చిన్న విషయము స్వయంగా విచారించుకుంటాను. దీనిపైన అయినా మీకు కృతజ్ఞత వుండనక్కరలేదా? చదువుకున్న విద్యార్థులు మీకు కృతజ్ఞత లేకపోతే ఎలా? క్రూరమృగములకంటే హీనమైపోతున్నారు. ఏదైనా దీనికి ఒక నయాపైసా యెక్కువ చేస్తే నేను యెంతో బాధ పడతాను. ఆ పిల్లలనుంచి తీసుకోకూడదు. మనమే యిచ్చేస్తాము అని పిల్లలకు తిరిగి వెనుకకు యిప్పించి నేను యెంతో ఆదర్శముగా వారిని చూచుకుంటున్నాను. అందువల్లన మీరందరు చక్కని విద్యావంతులై బయటవున్న విద్యార్థులకు మన ఇన్స్టిట్యూట్ విద్యార్థులకు స్పష్టంగా భేదము కనిపించాలి. కొంతమంది టీచర్సుకూడా చెబుతుంటారు, 'బయటి విద్యార్థులకు మన విద్యార్థులకు చాలా భేదముంది', అంటారు. అయితే, అంతటితో నాకు తృప్తి కావటంలేదు. ఇక్కడవుండినంతకాలము disciplineలో వుండి

sri sathyasai vachanamrutam

ప్రయోజనము లేదు. జీవితమంతా యీ discipline మీ వెంట వచ్చే shadow మాదిరి అనుభవించాలి. నీవు యింటిలో వుండినా, మార్కెట్టులో వుండినా యెక్కడవుండినప్పటికి నీ నీడ నిన్ను యే విధముగా అనుసరిస్తూవస్తుందో, మీ discipline కూడా ఆ విధముగా వుండాలి. 'ముండే ముండే మతిర్ భిన్నః' అన్నట్లు ఒకొక్క తల ఒకొక్క విధముగా వుంటుండాది. ఒక్కొక్కరి తలంపులు వేరు వేరుగా వుంటాయి. అది నాకు తెలుసు. అందరూ సమానముగా వుండటమనేది వీలేకాదు. నేను సమానముగా వుండమనికూడ కోరటంలేదు. చాల ప్రేమతో, భక్తితో సుందరయ్య చెప్పాడు, 'మేము ప్రామిస్ యిస్తున్నాం' అని. అయితే, తన విషయం తాను చెప్పుకోవచ్చునుగాని అందరి responsibility తాను యెట్లా తీసుకోటానికి వీలవుతుంది? అతని మాటలు యెంతమంది వింటున్నారు? నా మాటలే వినటంలేదు, యీ సుందరయ్య మాటలు వింటారా? కనుక, యెవ్వరుకూడను యీ విధమైన జవాబుదారీ తీసుకోటము సరైనదికాదు. ఎవరిది వారికే వదలి పెట్టండి. వారి వారి ప్రాప్తానుసారంగా జరుగుతుంది.

**భగవద్రతి కలిగిన దేశము కనుకనే 'భారతదేశము' అని పేరు వచ్చింది**

మానవత్వములో వుండినది, భిన్నత్వముతోకూడిన యేకత్వము. కాని, ప్రకృతి దృష్టిలోపల, యీ ప్రవృత్తిదృష్టిలోపల భిన్నముగానే కనుపిస్తుంది. ఒక్క ఆధ్యాత్మిక దృష్టిలో తప్ప మిగతా అన్నివిషయాలలో యేకత్వము సాధ్యము కాదు. 'అధ్యాత్మ విద్యా విద్యానామ్' అన్నది, భగవద్గీత. అనగా యేమిటి? 'విద్యలోకూడను ఆధ్యాత్మికవిద్యను నేను', అన్నాడు కృష్ణ పరమాత్మ. ఈ ఆధ్యాత్మికమార్గములో ఆరితేరిన మహర్షులు పుట్టిన పవిత్రమైన భూమి, భారతభూమి. భారతదేశమునకు ఆధ్యాత్మికముచేతనే గౌరవము యింత అభివృద్ధి అయింది. భగవద్రతి కల్గిన దేశము కనుకనే దీనికి 'భారతదేశము' అని పేరొచ్చింది. అలాంటి భారతదేశములో పుట్టిన మనము, యేకత్వాన్ని చక్కగా అభివృద్ధి పరచుకోటానికి ప్రయత్నించుకోవాలి. తన కుమారుడు యెక్కడైనా జారిపడినప్పుడు కాలు విరుగుతుంది. కుమారునిపై తల్లికి చాలా ప్రేమ వుంటుంది. కాని కుమారునికి కాలు విరిగిందే అని, అమ్మ కట్టు కట్టుకోటానికి వీలులేదు. కుమారుడే కట్టు కట్టుకోవాలి. ఎవరి ఆకలికి వారే

srisathyasaivachanamrutam

భుజించాలి. యెవరి భక్తి ప్రపత్తులు వారినే పోషిస్తాయి కాని ఒకరివల్ల ఒకరి భక్తి ప్రపత్తులు పోషింపబడటం సాధ్యముకాదు. యేది చెప్పినా మీ మంచికోసం చెబుతున్నారనే విశ్వాసమును మీరు అభివృద్ధిపరచుకోండి! నా నిమిత్తమై నేను యేదీ ఆశించలేదు. నా కోసమే ఆశిస్తే యిన్ని కోట్లు ఖర్చు పెట్టి యిన్ని భవనాలు కట్టించి, యిన్ని విధాల మిమ్మల్ని పోషించటానికి నాకేమి అవసరం? ఇది నా కవసరమేలేదు. అనేక దేశాలనుంచి భక్తులు కుప్పలు, కుప్పలు వచ్చి పడుతున్నారు. మీకొరకు వెచ్చించిన కాలములోపల ఒక అణుమాత్రమైనా వారికి నేను అందించటంలేదు. ఒక్కతూరి వారిని పలుకరిస్తే వారు యెంతో ఆనందమును అనుభవిస్తున్నారు. మీతో రాత్రింబవలు గడిపి, అన్ని విధాలా మిమ్మల్ని ఆదరించి, అనుకూలాలు చేసి, యిన్ని చేసినందుకు దీనివల్ల యేమి ఫలితము వచ్చింది? కనుకనే మీతో కాలము గడపటం నాకు అంత సంతృప్తినివ్వడం లేదు. ఏదో కొంతకాలం వారినికూడా ఫ్రీగా విడచిపెడదాం వాళ్లయొక్క ప్రాప్తానుసారం యెట్లా జరుగుతుందో అట్లా జరుగుతుందని వదలిపెట్టుకున్నాను. మీరు అనుకుంటారు, స్వామికి కోపంయేమోనని! కాని నాకు కోపము లేదు, బాధవుంది. దేనికోసం అంటే, 'నా మాట వినలేదని, అయ్యో దారితప్పిపోతున్నారే, జీవితమంతా పాడుచేసుకుంటున్నారే, ఆదర్శవంతమైనదానికి విరుద్ధముగా నడుస్తున్నారే' అని నా బాధ. ఎక్కడ వుండినప్పటికిని మనయొక్క హృదయానికి తృప్తిగా మనం నడచుకోటానికి ప్రయత్నించాలి.

**మానవ జన్మ చాలా దుర్లభమైనది**

ఇంకా కొన్ని విషయాలను యీనాడు మీకు చెబుతున్నాను. 'ఫలానా వాళ్లకి సీటు యివ్వటానికి వీలులేదు. వాళ్లకు మార్కులు సరిలేదు. వాళ్లు examination బాగా రాయలేద'ని Registrar, Vice chancellor కూడను కొందరు విద్యార్థుల విషయంలో అడ్డుపెట్టారు. 'లేదు లేదు ఆ పిల్లలకుకూడా ఒక ఛాన్సు యిచ్చి చూడాలి. వారికి స్వాతంత్ర్యము యిచ్చి ఒక్కతూరి పరీక్షించాలి. అట్లావుండకూడద'ని అందరికి నేను సీటు యిస్తూవచ్చాను. కానీ ఆ విద్యార్థులు సరైన రీతిలో వుండటంలేదు. ఇన్ని విధములుగా వారిని ఆదరించి వారి అభివృద్ధిని ఆశించి యింత చేస్తున్నప్పటికిని వారికి

మానవత్వముందా లేక దానవత్వముంటుందాదా లేక పశుత్వమనేది వుంటున్నాదా అనే సందేహము యేర్పడుతున్నాది. ఆకారము మానవాకారముగా వుంటున్నదే కాని, నిజముగా నా దృష్టిలో వీరంతా పశువుయొక్క భావాలు కలిగివున్నారు. ఎవరిని చూచినాగానీ లౌకికమైన భోగభాగ్యములు, లౌకికమైన ఆనందాలు. 'యిలాంటి అవకాశము లభించిందే, దీనిని మనం సార్థకంగావించుకుందాం' అనే వుత్సాహము, ఉల్లాసము వారిలో కన్పించటంలేదు. కానీ విద్యార్థులారా! మానవజన్మము యెప్పుడంటే అప్పుడు వచ్చేదికాదు. మానవజన్మము చాలా దుర్లభమైనది. తిరిగి వచ్చే జన్మము యే జన్మము వస్తుందో మనకు తెలీదు. ఇప్పుడు ప్రాప్తించిన ఈ మానవజన్మాన్ని సార్థకముగావించుకొనటానికి ప్రయత్నించండి. ఇహములో జీవించటానికి యిహ విద్యలు నేర్చుకోండి. పరతత్వములో శాంతిని పొందటానికి పరవిద్యనుకూడను మీరు అభ్యసించండి. ఇదే మనకు నిత్యముకాదు, ఇదే మనకు సత్యముకాదు. ఇహ లోకములో వుండినంతవరకు యీ విద్యలు మనము అభ్యసించవలసినదే! తద్వారా మన జీవితాన్ని మన కన్న తల్లితండ్రులయొక్క జీవితాన్ని కొంతవరకు పోషించవలసినదే! ఇది మన బాధ్యత. పాపానికి గురికావద్దండి! చేయరాని పనులు మనము చేయకూడదు. చనరాని ప్రదేశములో మనము చనకూడదు. ఇతరులకు కొంతవరకు సహాయము చేయవలసినదే; ఇది మన బాధ్యత. ఇతరులయొక్క జీవితాన్ని పాడుచేయటానికి మనము ప్రయత్నము చేయకూడదు. మనకు మనము పాడైనా మంచిదేకాని మనద్వారా మరొక జీవితాన్ని పాడుచేయకూడదు. తల్లితండ్రులు యెంతో కొండంత ఆశలు పెట్టుకొని మిమ్మల్ని యిక్కడకు పంపిస్తూవచ్చారు. వాళ్ల మనసుకు బాధను కలిగించకూడదు. వారికి తగిన సంతోషాన్ని అందించటానికి ప్రయత్నించండి. ప్రారంభములో నేను చెప్పినట్టుగా 'మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ'. తల్లితండ్రులకు ద్రోహము చేయకుండా చూచుకోండి. దైవమైతే క్షమించటానికి అవకాశముంటుంది. కానీ, తల్లితండ్రులు క్షమించే శక్తిమంతులుకాదు. ఏదో తెలిసో తెలియకో జరిగిపోయింది. ఇంకముందుకైనా సరైన మార్గమును అనుసరించి తద్వారా మీ భవిష్యత్తుకు తగిన రాజబాటను వేసుకోండి.

**తలవంచుకుని నడవటం వినయానికి ఒక చిహ్నము**



srisathyasaivachanamrutam

యీ వయసులో కొన్ని రకములైన తుచ్ఛభావాలంతా వస్తుంటాయి. మీరు వేరుగా భావించవద్దండి. దీనికి అనుసరించవలసిన మార్గాలుకూడా కొన్ని వుంటున్నాయి. మనము తలయెత్తుకొని అటుయిటు నడచినప్పుడే మనలో పిచ్చిభావాలు, కొన్ని రాకూడని తలంపులు ప్రవేశిస్తూవుంటాయి. మీరు చక్కగా పరీక్షించి చూడండి. మీరు నడచే సమయములో మీ చూపునంతా క్రిందికి చూచుకుంటూ పొండి, మీరెంతో అభివృద్ధిలోకి వస్తారు. దీనిద్వారా కొన్ని అనుకూలాలు, కొన్ని సహాయాలు యేర్పడుతూవుంటాయి. వుపకారములుకూడను చేస్తుంటాము. క్రిందచూసుకుంటూపోయే సమయములో అక్కడ ముండ్లు యింకేమైనా మనను బాధించేవి వుండవచ్చు. వాటిని తీసి మనము ప్రక్కన పెట్టవచ్చు. తద్వారా మనము యితరులకు వుపకారము చేసినవారమవుతాము. రోడ్డునుకూడను పరిశుభ్రము చేసిన వారమవుతాము. పిచ్చి పిచ్చి భావాలకు అవకాశములేకుండా వుంటుంది. ఎప్పుడూ యెటో చూస్తూ పోవటంచేత అనేక చెడు తలంపులంతా మీ తలలో ప్రవేశిస్తాయి. కనుక దిగువచూపు చూస్తూరండి. మీకందరికి బాగా తెలుసు, గ్రద్దకు రెక్కలుంటున్నాయి. అది చాలా ఎత్తైన ప్రదేశములో సంచరిస్తున్నా దృష్టి క్రిందకే పెట్టుకొని వుంటుంది. రెక్కలు వున్న పక్షి ఆకాశములో యెగురుతూకూడను దృష్టి క్రిందవుండినప్పుడు, భూమిపైన సంచరించేవానికి భూమిపైన దృష్టిలేకపోతే యెంత భ్రష్టుడౌతాడు, చెప్పండి? మీకందరికి బాగా తెలుసు, టౌన్‌లో సంచరించే పిల్లలు మోటారుసైకిలుపైనో, సైకిలుపైనో, కార్లోనో ప్రయాణములుచేస్తూ పోతుంటారు రోడ్డులో. కాని, వీరి దృష్టి యెక్కడ వుంటుంది? సినిమా వాల్‌పోస్టర్‌పైన వుంటుంది. దానివలన ప్రమాదములు జరుగుతుంటాయి. ఈ ప్రమాదాలకి మూలకారణము అదే! తల వంచుకుని నడవటం వినయానికి ఒక చిహ్నము. వివేకబుద్ధి పోషించుకోటానికి ఒక మార్గము. పరోపకారమునకు యిది సరైన తలంపు. మనలో దుర్భావములంతా ప్రవేశించకుండా వుండటానికి ఒక ఆధారము.

**తలంపులు మంచివిగా ఉంటే మన పనులుకూడా మంచివిగా ఉంటాయి**

ఇంతే కాకుండా మాటలు. మనము యెంతవరకు అవసరమో అంతవరకు మాట్లాడాలి. మితిమీరి మాట్లాడటంచేత అనవసరమైన మాటలంతా యిందులోకి ప్రవేశిస్తుంటాయి.



srisathyasaivahini.org

వీటిలో వారి విషయము, వీరి విషయము అనేదంతా ప్రవేశిస్తుంది. నీ విషయమేమిటో నీవు చూచుకో! యితరుల విషయముతో నీకేమి సంబంధము? ఈ విధముగా కొంతవరకు నీవు మాటలను అదుపులో పెట్టుకుంటే యెంతైనా నీ తలంపులుకూడను ఉన్నతమైన తలంపులు అభివృద్ధి అవుతాయి. మనము యెప్పుడుకూడను మంచిమాటలు వినటానికి ప్రయత్నించాలి. మంచిమాటలు చెప్పటానికి ప్రయత్నించాలి. మంచి విషయములను చూడటానికి ప్రయత్నించాలి. అప్పుడే మనలో మంచిభావములు వస్తాయి. చూసేది చెడ్డది, మాటాడేది చెడ్డది, వినేది చెడ్డది అయినప్పుడు తలంపులు మంచివి యెట్లావస్తాయి? వీటిని పురస్కరించుకొనే మన తలంపులు వుంటుంటాయి. కనుక మీరు మాట్లాడటము, చూడటము మంచిగా వుంటుంటే తలంపులు మంచివిగా వుంటుంటాయి. తలంపులు మంచివిగా వుంటే మన పనులుకూడా మంచివిగా వుంటాయి. కనుకనే మనము మంచి మాటలు వినటానికి ప్రయత్నించాలి.

**మాట ఒకటి వినరే మంచిమాట ఒకటి వినరే**
**మాట వినక పిచ్చి ఆటలాడుదురే ॥మాట॥**
**మాటిమాటికి రాదు మానవ జన్మము**
**బాట ఒకటేరా నావికుడా... ॥మాట॥**
**వాసనలు వదల వగతెలియక మీరు**
**ఆశలు అరమర చేసితిరేమి**
**వాసనలు క్లేశము ద్వేషము వదలి**
**దాసుడై సత్యసాయీశుని వరింపుము ॥మాట॥**

'మంచిమాట వినరు మనసిచ్చిచెప్పిన, చెడ్డమాటలంత చెవికి చేర్చు'. చెడ్డమాటలు చెపుతున్నారంటే అందరు చెవులు నిక్కపొడుచుకు వచ్చి వింటారు. మంచిమాట చెపుతూంటే 'ఆ యిదా', అని వెళ్లిపోతుంటారు. ఇది యీ వయసులో వుండిన దుర్భావము. అదొక దురదృష్టము. అందుకు బదులు చెడ్డమాట ఎవరైనా మాట్లాడుతున్నప్పుడు 'యిది అక్కరలేదని వెళ్లిపోవాలి. ఇది నిజమైన అదృష్టము. ఇంకా వీలుపడితే వాళ్లకు బుద్ధి చెప్పి

sri sathyasai vahini amrutam

యిలాంటిది మాటాడవద్దని చెప్పాలి. మంచిమాటలా, మనసంతా అక్కడ యేకాగ్రతపరచి వినండి. ఈ విధంగా జీవితముయొక్క రహస్యాన్ని చక్కగా గుర్తించుకోవాలి.

**నామస్మరణ చాలా పవిత్రమైనది**

జయదేవుడు అనే ఒక పరమభక్తుడు వుండేవాడు. 'కృష్ణా!' అనేటప్పటికి శరీరమంతా మరచిపోయేవాడు. అతని భార్య పద్మావతి. వంగదేశపురాజుకూడను పరమభక్తుడు. ఆ రాజు, రాణిగారు యిద్దరుకూడను వచ్చి ఈ దంపతులు చేస్తున్న భజనలు మరియు సేవలకు పరమానందమును పొందేవారు. వీరి సత్సంగము మనకు లభించిందే యింక రాజ్యమెందుకు, యీ పదవులెందుకు, యీ ధనమెందుకు అని జయదేవుని చర్యలన్నింటిని చక్కగా గుర్తించుకుంటూ వుండేవారు. ఇది భక్తికి సరైన లక్షణము. జయదేవుడు యేవిధములైన కష్టనష్టములకు, దుఃఖములకు విచారములకు చింతించేవాడుకాడు. ఎప్పుడుకూడను కృష్ణుడి లీలలను తలుచుకుంటూ, కృష్ణుని ఆటలు, కృష్ణుని పాటలు, కృష్ణుని మాటలు తప్ప వేరొక ధ్యాస ఉండేది కాదు, అతనికి. ఒక్కొక్క సమయములో భార్యనుకూడను కృష్ణునిగా భావించేవాడు. అప్పుడు ఆమె 'యేమిటండీ! నేను', అంటే అప్పుడు కొంచెము తెలివితెచ్చుకొనేవాడు. ఆ విధముగా తాదాత్మ్యభావన పొందినాడు, కృష్ణునితో.

ఒకనాడు జయదేవునితో యీ వంగదేశపురాజు ఆనందముగా గడపడానికి వెళ్లాడు. ఏ సిపాయిలు, యేవిధమైన అధికారులను వెంట తీసుకుపోలేదు. తన మనసులో యేమైనా కొంచెము మాలిన్యమైతే తక్షణమే "నీవు దూరమువుండు కృష్ణా! నా దగ్గరకు రావద్దు. నా మనసంతా మాలిన్యమైపోయింది. నీవు రావటానికి వీలులేదు. ఈ మలిన హృదయములోపల నీవు ప్రవేశించటానికి వీలులేదు" అని కృష్ణునికూడను దూరము వుండమని చెప్పేవాడు, జయదేవుడు. కాని, కృష్ణుని తలంపు ఎప్పుడూ విడిచేవాడుకాదు. ఒక ప్రశాంత ప్రదేశములో కూర్చొని ఆనందముగా భజన చేసుకుంటూ తన మనసును పవిత్రము చేసుకొనేవాడు. ఆ తరువాత "కృష్ణా! యిప్పుడు నా మనస్సు శుద్ధమైంది. ఇప్పుడు నీవు వచ్చి చేరిపో!" అని యెంతో ఆవేదనగా పిలిచేవాడు. అదే విధంగా మన

srisathyasaivachanamrutam

మనసులో మాలిన్యము ప్రవేశించిన తక్షణమే పరిశుద్ధము చేసుకోటానికి ప్రయత్నించాలి. ఊరికే మాలిన్యం, మాలిన్యం అంటే యెట్లాపోతుంది? మాలిన్యముపైన తిరిగి మాలిన్యం అట్టకట్టుకొనిపోతుంది. అందువలన ఎప్పటికప్పుడు పరిశుద్ధము చేసుకుంటూపోవాలి.

రాజాగారు వెళ్లినారుకదా అని రాణిగారు జయదేవుని భార్య పద్మావతి దగ్గర కూర్చొన్నారు. ఆ పద్మావతికూడను పరమభక్తురాలు. జయదేవునికి తగిన భార్య. అలాంటివారు లభించటమనేది అదృష్టము. భర్త మంచివాడైతే భార్య గయ్యాళి కావచ్చు. భార్యమంచిదైతే భర్త క్రూరుడు కావచ్చు. కాని, యిలాంటి దాంపత్యము అనేది అదృష్టముతో లభించేది. ఇటు పద్మావతికూడా కృష్ణుని తలుచుకుంటూ తనయొక్క పతితోబాటు కృష్ణ లీలలను ఆనందముగా జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఆనంద బాష్పములను కార్చుకుంటూ యెంతో ఆనందముగా వున్నది. ఇంతలో ఒక మనిషి అక్కడకు పరుగెత్తి వచ్చి 'అమ్మా! అమ్మా!' అన్నాడు. రాణి తలయెత్తి చూచింది. కాని పద్మావతి యేమాత్రము తలయెత్తి చూడలేదు. ఆమెయొక్క యేకాంతమునకు, ప్రశాంతికి భంగము కలిగించకూడదు అని రాణి మెల్లగా అతనిని విచారించింది. విషయమేమంటే, పద్మావతియొక్క అన్నగారు heart attackతో మరణించినారు. అతనిని చితిపైన పేర్చివుంటే వదినగారు ఆ చితిలోపడి సహగమనము చేసుకుంటున్నారు. ఆనాడు telegrams & post యివన్నీ లేవు. కాబట్టి మనిషి వార్త తీసుకుపోవటంచేత ఆలస్యం అయిపోయింది. కనుక, యీమెకు చెప్పటానికని వచ్చానని చెప్పాడు. ఇది చాలా అవసరమైన విషయమని చెప్పి పద్మావతిని లేపింది, యీ రాణిగారు. ఆమె కన్నులు తెరచిచూచింది. ఏమి కావాలని అడిగింది. 'మీ అన్నగారు మరణించారుట! మీ వదినగారు సహగమనము చేస్తున్నారుట! మీరు తక్షణమే వెళ్లాలిట!' అని చెప్పింది. పద్మావతి చిరునవ్వు నవ్వి 'యెవరికి యెవరు అన్న? ఎవరికి యెవరు వదిన? దేహసంబంధముగా వుండవచ్చుగానీ నాకు సంబంధములేదు. ఏనాటికైనా వచ్చినవారు పోకతప్పదు. దేహము వీడడానికి ఏదో ఒక కారణము వుంటూవుంటుంది. ఇవి భగవంతుడు చేసే లీలలు. అంతేకాని దీనికి నేను యేమాత్రము బాధపడటంలేదు. పోనక్కరలేదు', అంది. భగవంతుడు తనను రప్పించుకోవాలంటే ఒక పామునైనా పంపించి కరపించి తన దగ్గరకు పిలిపించుకుంటాడు. అదే విధంగా నాకు ఏదైనా అవసరము

sri sathyasaivachanamrutam

వచ్చినప్పుడు నేను ఎవరినో ఒకరిని పంపిస్తాను. ఎవరైనా student వుంటాడు. చిరంజీవిరావు వుంటాడు. కుటుంబరావు వుంటాడు. యింకెవరినో పంపించి వాళ్లను తీసుకురండని చెప్పి పంపిస్తాను. అలాగే భగవంతుడు ఎవరినైనా తన వద్దకు తెప్పించుకోవాలనుకున్నప్పుడు ఒక పామునో, తేలునో, లేక heart attackనో పంపించి పిలిపించుకుంటాడు. తాను పిలిపించుకోవటమేగాని మనంతట మనము పోవటానికి మనకేమాత్రము అధికారములేదే! కనుక మనము దీనిగురించి విచారించనక్కరలేదు. 'ఓహో! దీని వెనుక యింత పెద్ద వేదాంతము అంతా వుంటుందాదే', అని అనుకొని రాణిగారికి యీమెపైన కొంతవరకు కోపము వచ్చి 'యిది నిజమైన వేదాంతమా లేక stunt చేస్తుందాదా', అని పరీక్షించాలని ప్రయత్నించింది. 'ప్రాణముపోయిన తరువాత, వారిని కాల్చవచ్చు. అయితే, ప్రాణముతో వుండిన మీ వదినగారు అందులో పోయి కూర్చోవాలంటే యెంత త్యాగము?' అన్నది. అప్పుడు పద్మావతి చెప్పింది, 'యిది త్యాగముకాదు, సాహసము. నిజముగా భర్త పోయినాడంటే భార్య తక్షణమే తన ప్రాణం విడచాలి. అది సహజమైనదిగాని యీ సహగమనములో పోవటము దుస్సాహసము. ఇది సరియైనదికాదు', అని చెప్పింది. అప్పుడు రాణి యీమెను పరీక్షిద్దామని కొంతదూరము పోయివచ్చి 'అమ్మా! జయదేవునికి పులి కరచి అనేక విధములుగా బాధపడి చనిపోయినాడు', అని చెప్పింది. 'అహా! జయదేవుడు పోయాడా?' అని చెప్పి తక్షణమే ప్రాణం విడిచింది, పద్మావతి. రాణిగారికి కంగారు బయలుదేరింది. 'ఏదో నేను పరీక్షచేయటానికి యీ విధముగా ప్రయత్నము చేస్తే యింత ప్రమాదము సంభవించిందే', అని చాలా బాధపడింది. కొంతసేపయ్యేటప్పటికి జయదేవుడు, రాజాగారు యింటికి వచ్చారు. అప్పుడు రాజాగారిని ప్రక్కకు పిల్చి 'నేను చేసిన యీ పాపానికి నేను యేమాత్రము సహించుకోలేను, నాకు శిరచ్ఛేదము చేయండి', అనింది రాణిగారు. 'నీ భావాలు నీవు మార్చుకోవాలిగాని ఇతరులను పరీక్షించటానికి ప్రయత్నంచేయటం మూర్ఖత్వము. స్త్రీహత్య మహాపాతకం. కనుక నీ ముఖము చూడను. నాకు నేను ప్రాణము తీసుకుంటాన'న్నాడు, మహారాజు. ఇలాంటి భార్యవుంటుండి ప్రయోజనమేమిటని, యీ పవిత్రమైన భక్తురాలి ప్రాణం తీసిందని ప్రాయశ్చిత్తముగా తన ప్రాణం తీసుకుంటానన్నాడు. కనుక, ఇతరులను

sri sathyasai vachanamrutam

పరీక్షించటానికి యెవ్వరుకూడను ప్రయత్నంచేయకూడదు. ఇది మహా మూర్ఖత్వము. ఎందుకనగా, ఆ శక్తిసామర్థ్యములు నీలో వుంటున్నవా? లేవు. అలాంటప్పుడు పరీక్షించే అధికారము నీకు యెక్కడనుండి వస్తుంది? ఈ విధంగా తన ప్రాణం తాను తీసుకొనే నిమిత్తమై జయదేవుని ఆజ్ఞకై వెళ్లాడు. ఆయన నవ్వుతూ భార్య కళేబరం దగ్గరకు వచ్చాడు. అక్కడకు వచ్చి ఆమెను చూచి 'నీవు యెంత అదృష్టవంతురాలవు. భగవంతునిలో చేరిపోయావు. సుమంగళిగా వుండు' అని ఆశీర్వదించాడు. అప్పుడే 'గీత గోవిందము' అనే కావ్యమును ఆశువుగా చెప్పాడు. ఆ గీత గోవిందములో 24 శ్లోకములు పూర్తై 25 వ శ్లోకము ప్రారంభమయ్యేటప్పటికి ఆమె లేచి కూర్చుంది. ఇంతటి మహాశక్తివంతమైన ఈ గీత గోవింద కావ్యమును ఆ రాజు తన రాజ్యమంతా ప్రచారము చేస్తూవచ్చాడు.

**నామ స్మరణను ప్రశాంతినిలయమునుండి ఒక ఆదర్శవంతమైన ఆధ్యాత్మిక కార్యక్రమముగా ప్రపంచానికి చాటాలి**

భగవన్నామము పోయిన ప్రాణాన్నైనా యిస్తుందన్నారు. కనుక నామస్మరణ అనేది చాలా పవిత్రమైనది. ఈ నామస్మరణ చేసే సమయములో హృదయపూర్వకముగా మనము చెయ్యాలి. విద్యార్థులారా! యీ నామస్మరణ విషయములో మీరు కొంచెం గమనించాలి. భగవంతుడు సర్వదేవతాస్వరూపుడు. అనేక రూపాలు, అనేక నామాలు వుండినవాడు. కాని, యికపైన మీరు కొన్ని కొన్ని మార్పులు చేసుకుంటూరావాలి. ఇతర దేశస్థులు, భారతదేశములోనే అనేకమంది భారతీయ సంస్కృతిని అనేకరకములుగా అపోహలతో విమర్శించుతూవచ్చేవారు ఉన్నారు. కనుక, యీ నామస్మరణ అనేది ప్రశాంతినిలయమునుండి ఒక ఆదర్శవంతమైన ఆధ్యాత్మిక కార్యక్రమముగా ప్రపంచమునకు చాటుతూరావాలి. రేపటినుండి కొన్ని సెలక్టు చేసుకున్న నామాలు చెప్పండి. 'రాధాకాంత', 'పార్వతీరమణ', 'లక్ష్మీరమణ' యిలాంటివన్నీ మీరు మానివేయండి. యివి వుండటంవల్ల తప్పేమీలేదుకాని శ్రీరామచంద్రుడు సీతతోనే వుండినప్పుడు, ఈశ్వరుడు పార్వతితోనే వుండినప్పుడు, విష్ణువు లక్ష్మితోనే వుండినప్పుడు, 'నేనెందుకు నా భార్యతో వుండకూడదు?' అనే భావాలు కొందరిలో వస్తున్నాయి. కనుక, యిలాంటి

srisathyasaivahini / sathyasaivachanamrutam

భావాలు ప్రజలలో రాకుండావుండే నిమిత్తమై ఈ నామములను విడిచిపెట్టమని చెపుతున్నాను. 'సీతారామ', 'పార్వతీపరమేశ్వర' అంటే యేమిటి? పార్వతి అనేది స్త్రీ కాదు. లక్ష్మి అనేది స్త్రీ కాదు. రాధ అనేది స్త్రీ కాదు, ప్రకృతి స్వరూపాలు. ప్రకృతిని మొట్టమొదట తలచుకొనిన తరువాత పరమాత్మను తలచుకుంటున్నాము మనము. పరమాత్మనే తలుస్తాము. అది ఒక ఉత్తమమైన భావము. చాలామంది, మీకు తెలియదుగాని, యీ విదేశీయులంతాకూడను 'రాముడు సీతతో తిరుగుతున్నాడు. పరమేశ్వరుడు పార్వతితో తిరుగుతున్నాడు. నేను యెందుకు తిరగకూడదు?', ఆ విధమైన భావములను ప్రవేశపెట్టి పెడమార్గము పడుతున్నారు. ఈ సాంప్రదాయము పూర్వము యెందుకు ప్రారంభమైందంటే, ప్రకృతిని మొదట మనము అనుసరించి తదుపరి ప్రకృతిద్వారా పరమాత్మను పొందాలనే ఆదర్శము కోసము. రాధాకృష్ణ అంటే రాధ ఒక స్త్రీ, కృష్ణుడు ఒక పురుషుడు అని కాదు, యిక్కడ. 'రాధ' అంటే ప్రకృతి. రాధ, ధరా. ఆ ప్రకృతిని తాను వరిస్తున్నాడు. ప్రకృతిని పోషిస్తున్నాడు. 'మాధవుడు' అనగా యేమిటి? మా-ధవ. 'ధవ' అంటే భర్త. భర్త అనగా యేమిటి? Master. ప్రకృతి, పరమాత్మల సంయోగము. యీనాడు మనము ప్రకృతిలో వున్నాము. ప్రకృతిని అనుభవిస్తున్నాము. ప్రకృతిని మనము తలచనక్కరలేదు. పరమాత్మను తలుస్తాము. యిలాంటి ప్రకృతితత్త్వాన్ని యీనాటినుండి మనము వదలి పరమాత్మతత్త్వములో ప్రవేశించాలి. ప్రకృతిలోనే వుంటే ప్రకృతి భావాలు, ప్రకృతి తలంపులు, ప్రకృతి చర్యలుకూడను మనలో ప్రవేశిస్తూవుంటాయి. ఇంకా కొన్ని కొన్ని పాటలు మీరు చెబుతూవుంటారు. కొన్ని అర్థరహితమైన పాటలుగా వుంటుంటాయి. ప్రేమతో చెప్తూవుంటారు. కాని దాని అర్థముకూడను మనము గ్రహించాలి. ఇప్పుడు గణపతి చెప్తుతుంటారు. 'ఈశ్వరపుత్రా', అని చెబుతూవుంటాము. కానీ ఈశ్వరపుత్రుడు గణపతి అని చెప్పి తిరిగి ఈశ్వరుడుకూడను గణపతిగానే వస్తుండాది. ఒకతూరి పార్వతికి కుమారుడౌతాడు గణపతి, మీయొక్క దృష్టితోచూస్తే. ఈశ్వరుడు భర్త అవుతాడు. అయిన తరువాత సాయిగణేశా అంటుంటే తిరిగి అతనికి ఒక తొండము పెట్టాము మనము. ఒక తట్టు ఈశ్వరా అని చెప్పేది. తరువాత సాయిగణేశా అనేది. గణేశుడంటే ఈశ్వరుని కుమారుడైపోతాడు. తానే ఈశ్వరుడు, తానే ఈశ్వరుని కుమారుడు యే విధముగా

srisathyasaivacanamrutam

అవుతుంది? సరైన అర్థముగా వుంటుండదు. ప్రేమతో చెప్తుంటారు. కాని, బయటివాళ్లు దీనిని అనుసరించటంచేత కొంతవరకు విమర్శించటానికి అవకాశము వుంటుంది. స్త్రీ లింగం వచ్చేదగ్గర పాటలన్నీ omit చేయండి. 'రామా, కృష్ణా, గోవిందా, నారాయణ, మధుసూధనా', యిలాంటి పేర్లు యెంతైనా మీరు చెప్పుకుంటూపొండి. ఇంకా యేమైనా వుంటుంటే మాత దివ్యమైన జగజ్జనని కనుక మాతపేరు మీరు వుపయోగపెట్టుకోవచ్చు. కానీ, యీ దాంపత్యమనేదానిని మాత్రం విసర్జించండి. అది మాత్రం ప్రవేశపెట్టవద్దు. ఆ విధంగా భజనలు మీరు అభివృద్ధిచేసుకుంటూ దీనిద్వారా జగత్తును యెంతైనా అభివృద్ధిగావించవచ్చును.

**ఇతరుల లోపాలను యెంచేవాడు అవి తనలో లేవా అని యోచన చేయాలి**

ముఖ్యముగా యీనాటినుండి యీ పిచ్చి భావాలకు, పిచ్చి తలంపులకు అవకాశమునివ్వకుండా పవిత్రమైన భావాలు తల్చుకుంటూ వచ్చిన పనిని మీరు చూచుకొని చక్కగా disciplineతో నడచుకొని, క్లాసులో మంచి మార్కులు తెచ్చుకొని, మీ తల్లితండ్రులను సంతోషపెట్టేదానికి మీరు పూనుకోండి. ఒకటి మాత్రం మరచిపోండి! 'స్వామికి కోపం' అని మీరు కలలోకూడను వూహించకండి. కోపములేదు నాకు. ఈ ఆట మీకు సహజమే! ఇలాంటివి తెలిసికూడను నేనెందుకు కోపపడతాను? నా బాధల్లా ఎప్పుడు మీరు realise అవుతారు, అని. మంచిగా నడచుకోలేదే అని బాధ. సరిగా చదవటంలేదే అని బాధ. ఒకరికొకరు ఐకమత్యంగా వుండటంలేదే, అని బాధ. ఎప్పుడు చూచినాకూడ ఒకరిని చూచి మరొకరు అసూయపడటము, ఒకరిపైన ఒకరు కోపంగా వుండటము, ఒకరిపైన ఒకరు చాడీలు చెప్పటము, యిది మన పిల్లలకు వుండవలసినదికాదు. కాని, యిది మొత్తముపైన అందరికి వుంటున్నాది. ఒకరు 'అతనికి జలసీ వుంద'ని అంటారు. కానీ, 'నాకు మాత్రంలేదా?' అని వాడు యోచన చేసుకోటంలేదు. ఇతరులకు చెప్పేవాడు తనలో లేకుండా చూచుకోవాలి. యిక్కడ యింతకాలం ఆనందం అనుభవించినందుకు ఆ కృతజ్ఞతను మాత్రము హృదయంలో పెట్టుకోండి. కృతజ్ఞత లేకపోతే మనము నిజముగా మృగములకంటే హీనమైపోతాము. ఎవరైనా సరే, చేసినమేలు మరువరాదు. మరచినవాడు

sri sathyasai vachanamrutam

కృతఘ్నుడుగాని, కృతజ్ఞతవుండినవాడుకాదు. కృతజ్ఞత మనలో వుండినంతకాలం మనం క్షేమంగా అభివృద్ధిపొందుతాము. ఎంతటి వున్నతస్థాయినైనా చేరుతాము. అహంకారము, కృతఘ్నత రెండూ పోవాలి. అహంకారాన్ని వుంచుకోకూడదు. కృతఘ్నుడు కాకూడదు. ఇవి రెండే మానవునికి ప్రధానమైన సూత్రములు. త్వరలో మార్చి exams వస్తున్నాయి. సరైన రీతిలో మీరు వున్నతస్థాయిని అందుకోవాలి. ప్రతి వ్యక్తికికూడను 'O' grade రావాలి. నాకు 60% వచ్చింది. 50% వచ్చింది అంటారు. 50% వస్తే మిగిలిన 50% ఏమైనట్టు? 60% వస్తే 40% యేమైపోయినట్టు? అంతటికంతా తేవాలి. అలాంటి విద్యార్థులుగా తయారుకావాలి. Hostelలో మీరు సరైన క్రమశిక్షణ అభివృద్ధి పరచుకోండి. మీరు యీ రోజు వుండవచ్చు, రేపుపోవచ్చు. కానీ, వచ్చే పిల్లలకు ఆదర్శములు చూపించాలి. పోయిన పిల్లలు అంతా యెట్లా వుండినారు? చెడ్డపేరు తేకూడదు. చక్కని ఆదర్శమును చూపించాలి. ఈ విధముగావుండి మీరు సరియైన పేరు తెచ్చుకొని 'అయ్యో' యిలాంటి మంచి పిల్లవాడు hostel నుండి pass అయి వెళ్లిపోయినాడే', అని వుండే పిల్లలకు ఆ విధమైన ప్రేమభావము అభివృద్ధి అయ్యేట్లుగా మీరు పోవాలి. 'అబ్బ! ఆ పిల్లవాడు పోయినాడు, చాలా సంతోషం', అని విసుగుపుట్టేరీతిగా మీరు ప్రవర్తించకూడదు. మీరు కళాశాల విడచిపోయినా మీ పేరు hostelలో మంచిగా వుండాలి. మీకు ఏమీ అక్కరలేదు. స్వామి చెప్పినది పవిత్రమైనదని పూర్తిగా విశ్వసించి దాన్ని అనుసరించండి. మీరు యెంతటి వున్నతస్థితికైనా పోతారు. నాకోసం నేను యెప్పుడు యెవరికి యేమీ చెప్పలేదు. చెప్పనుకూడ! ఉత్తమ భావాలు పెంచుకొని పవిత్రమైన జీవితాన్ని గడిపి ఆదర్శవంతమైన విద్యార్థి జీవితమును అందించటానికి మీరు పూనుకోండి. అదే నాకానందము. తల్లితండ్రుల ఆజ్ఞ శిరసావహించండి. నేను అనేక పర్యాయములు చెప్పాను. 'మీ food, మీ head, మీ blood అంతా తల్లితండ్రులయొక్క gift' అని. వారికే మనము కృతజ్ఞతనందించలేకపోతే యింక యెవరికో యేరీతిగా అందించగలము? ఏమీ ప్రయోజనములేదు. తల్లితండ్రులను మాత్రము ధిక్కరిస్తూవుంటారు. క్రొత్తగా వచ్చిన భార్యనుమాత్రం అనుసరిస్తుంటారు. ఇదికాదు, మనయొక్క ఆచరణ. వారికి యివ్వవలసిన స్థానం వారికి యివ్వండి. వీరికి యివ్వవలసిన స్థానం వీరికి వుండాలి. ఎప్పటికైనాగాని తల్లితండ్రులకు మనము

srisathyasaivacharamrutam

కొడుకులమే! ఈనాడు భార్య చాలా అమృతంగా వుంటుంది. తల్లి విషముగా వుంటుంది. అది పిల్లవాడికి సరియైనదికాదు. తన్ను పోషించి, పెద్దచేసిన తల్లి విషమైతే నిన్న మొన్న వచ్చిన భార్య నీకు ఎందుకు విషము కాకూడదు? అది కేవలము ఒక భ్రమ. Today and tomorrow marriage అయిన తక్షణమే wife is life అంటారు. తరువాత wife is knife అయిపోతుంది. చాలా జాగ్రత్త. చాలా బాధలుపడతారు. అది చూచుకోవాలి. అందువలన వారిని అదుపులో పెట్టుకోవాలి, వీరికి తగిన గౌరవమర్యాదలు యివ్వాలి. ఇక్కడనుంచి పోయి ఆదర్శవంతమైన గృహస్థులుగా వుంటుండండి. 'ఓరే, సాయి Institute నుండి వచ్చిన పిల్లలు యెట్లాగున్నారు, చిలకాగోరింకల్లాగా వున్నారే', అని అందరూ అనుకోవాలి. ఎప్పుడు చూచినా పోట్లాడటం యిలాంటివి వుండకూడదు. ఇద్దరు ఆదర్శవంతమైన రీతిగా ఆధ్యాత్మికముగాను, లౌకికముగాను మీరు యితరులకు ఆదర్శవంతముగా వుండాలి. ఇంక మూడు నాలుగునెలలో MBA 2nd year పిల్లలు, PG పిల్లలు అందరూ వెళ్లిపోతున్నారు. ఈ వెళ్ళిపోయేవారు మాత్రము చక్కగా అక్కడకు వెళ్లిన తరువాత స్వామి వాక్యాలు ఒకటి రెండైనా మనసులో పెట్టుకొని ఆదర్శముగా నిరూపిస్తారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి ఈ మూడింటిని దృష్టిలో పెట్టుకోండి**

మొన్నచెప్పాను. Love of God, fear of sin, morality in society యీ మూడు మీరు దృష్టిలో పెట్టుకోండి. అవకాశము చిక్కినప్పుడు సమాజములో ప్రవేశించి సేవలు చేయండి. సేవలు చాలా అవసరము. ఆ సేవ నిమిత్తమే నీ దేహము వచ్చింది. 'పరోపకారార్థమిదం శరీరం'. 'శరీరమాద్యం ఖలుధర్మసాధనం'. అంతేకాని యేదో loading, unloading చేసుకొని వూరికే Road roller మాదిరి మనము తయారుకాకూడదు. సేవలు చెయ్యాలి. నడుము వంచాలి. మీరు పని చేస్తూకూడను యితర యోచన చేయకుండా భజన చేసుకుంటూ పని చేయండి.

**(తేదీ 14-12-1987న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam